క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు, పండ్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సుబ్బారెడ్డి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు వైఎస్సార్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులను సత్కరించి దుస్తులను అందజేశారు. అనంతరం ఎస్‌ఐ పి.బుజ్జిబాబును సత్కరించారు. పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు ఏర్పాటుచేసినందుకు సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్ రెడ్డి, రొంగల అప్పాజీ, పోతుల ప్రసాద్‌రెడ్డి, బొడ్డు ముత్యాలరావు, కిలపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రీ హోమం



గాయత్రీ హోమం చేస్తున్న నిర్వాహకులు

రాజానగరం: లోక శాంతిని కాంక్షిస్తూ దివాన్‌చెరువులోని సేవా ఉగాది ఆధ్వర్యంలో ఆదివారం శాంతి, గాయత్రీ హోమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని గోదావరి విద్యా పీఠంలో యోగా సాధన చేస్తున్న శిక్షకులు, సాధకులు, సేవ ఉగాది సేవకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ



కోటపాడులో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న స్థానిక నేతలు


రంగంపేట: మండలంలోని కోటపాడులో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పనులకు మండల పరిషత్ విప్ సభ్యుడు సుంకర అప్పారావు, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవరసాని రాజులు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుగ్గిల వెంకటేశ్వర్లు, గంథం వీరబాబు, సిరిగిన వెంకటేష్ పాల్గొన్నారు.



రంగంపేటలో కనకదుర్గాదేవి అలంకరణలో ఉమామహేశ్వరిదేవి



చంద్రేడులో కనకదుర్గాదేవి అలంకరణలో కాత్యాయనీదేవి




బిక్కవోలులో అమ్మవారికి బూరెలతో అభిషేకం



తొస్సిపూడిలో దుర్గాదేవిగా నవదుర్గాదేవి అమ్మవారు



కనకదుర్గాదేవిగా గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ



నిమ్మకాయలతో ప్రత్యేక అలంకారంలో వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ

దుర్గామాతా శరణు శరణు

- ఆలయాల్లో కుంకుమ పూజలు
- తరలివచ్చిన భక్తజనం

సీతానగరం: దుర్గామాతా శరణు.. శరణు అంటూ ఆ జగన్మాతను భక్తులు కొలిచారు. దేవీ నవరాత్ర ఉత్సవాల సందర్భంగా మండలంలోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. రఘుదేవపురం కోటదుర్గమ్మ వారి ఆలయం వద్ద దుర్గమ్మ తల్లి భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు వేదాంతం రాము, కేశవలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాపాక పంచాయతీ పరిధి శ్రీరామనగరం, రాజంపేట, మునికూడలి, వెదుళ్లపల్లి, కాటవరం, బొబ్బిల్లంక, ములకల్లంక తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలాలు సమర్పించారు. వంగలపూడి గాయత్రీ దేవి ఆశ్రమంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. సింగవరం నాగరత్నం కాలనీ వద్ద కనకదుర్గమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



రఘుదేవపురం కోటదుర్గమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చన పూజల్లో మహిళలు

మధురపూడి: గాడాల రాజరాజేశ్వరి తల్లి ఆలయంలో అమ్మవారికి గాజుల పూజ జరిగింది. మహిళలు గాజులను అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. భవానీ భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమార్చనలు చేశారు. దోసకాయలపల్లి దేవీ సెంటర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

జగన్మాత.. శక్తి స్వరూపిణి..

రంగంపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. రంగంపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారిని విజయ కనకదుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. వెంకటాపురంలో విజయ కనకదుర్గాదేవి ఆలయం వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కోటపాడులో దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా భక్తులు సాయిమాతకి భారీ సారె సమర్పించారు. స్థానిక సాయి మందిరంలోని సాయిమాత మండపాన్ని ఏర్పాటు చేసి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దాంట్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్తులందరూ ఏకమై వివిధ రకాల పిండి వంటలు, పువ్వులు, స్వీట్లు, పండ్లను పెద్ద ఎత్తున సమకూర్చి కావిళ్లతో భజాభజంత్రీలు, మేళతాళాలతో ఊరేగింపుగా సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.



గాడాల రాజరాజేశ్వరీ తల్లి ఆలయంలో అమ్మవారి అవతారాల్లో చిన్నారులు



కోటపాడులో అమ్మవారికి గ్రామస్తులు తీసుకొచ్చిన భారీ సారె

బూరెలతో అభిషేకం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు చెరువు గట్టు వీధిలో ఎలుగుబంటి వారి ధనదుర్గమ్మ అమ్మవారికి బూరెలతో అభిషేకం చేశారు. అనంతరం బూరెలను భవానీ మాలధారులకు అందజేశారు. తొస్సిపూడి కాలువ వద్ద కొలువైన అమ్మవారిని దుర్గాదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. పందలపాక, బలభద్రపురం, ఊలపల్లి, కొంకుదురు, కొమరిపాలెం గ్రామాల్లోని పలు ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవీచౌక్ ఆలయంలో ప్రత్యేక పూజలు

గోకవరం: స్థానిక దేవీ చౌక్ ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం శ్రీకనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి అలంకార పూజలు నిర్వహించారు. కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు పీటలపై కూర్చొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరభద్రునిగద్దె, వెలమపేటలోని ఊర కాలువ గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల్లో చండీహోమం నిర్వహించారు. సోమవారం గోకవరం దేవీచౌక్ ఆలయంలో, వీరభద్రునిగద్దెలో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఊరకాలువ గట్టుపై కనకదుర్గమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- సంపరలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంపరలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ, ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర పథకాలు దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ ఇప్పటివరకూ అమలుచేయలేదన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రోజురోజుకూ జగన్‌మోహన్‌రెడ్డికి ఆదరణ పెరుగుతుందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, నాగిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, అద్దంకి భద్రం, తోట సాయి, కొల్లు పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.



సంపరలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

జగనన్న సురక్షతో ఆరోగ్యానికి భరోసా



మల్లంపూడిలో ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజానగరం: రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని సర్పంచ్ ముప్పిరిశెట్టి నాగచక్రధార అన్నారు. మల్లంపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి టి.రవికుమార్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మల్లంపూడి, ముక్కినాడ, ముక్కినాడపాకలు, పీఆర్సీపురం నుంచి వచ్చిన 700 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, వార్డు సభ్యులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలను ఆచరించాలి



మాట్లాడుతున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: క్రీస్తు బోధనలతో సమాజం సన్మార్గంలో నడుస్తుందని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ మాణిక్యం అన్నారు. ఆదివారం కోరుకొండ ఎస్‌ఆర్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో వ్యాదవ్యాపక పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు సువార్తను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనల్లో ఉపదేశకుడు బెల్లపు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సందడే.. సందడి

పుష్కర వనంలో ఆత్మీయ సమ్మేళనం

రాజానగరం: రెవెన్యూ శాఖలో 39 ఏళ్ల పాటు వివిధ శాఖలు, ప్రాంతాల్లో పనిచేసిన సహచరులంతా ఒకచోట కలుసుకుని ఆదివారం సందడి చేశారు. లాలాచెరువులోని పుష్కర వనం ఈ ఆత్మీయ సమ్మేళనానికి వేదికైంది. వారంతా అలనాటి మధుర స్మృతులను నెమర వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. 1984 జూన్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించబడి అడ్‌హక్ విలేజ్ అసిస్టెంట్లుగా విధులు ప్రారంభించారు. ఆపై రెవెన్యూ శాఖలో వివిధ హోదాలలో పనిచేసి డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగ విరమణలు పొందారు. మరికొందరు డిప్యూటేషన్‌పై కమర్షియల్ డిపార్టుమెంట్‌లో కూడా పనిచేశారు. ఈ విధంగా 39 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి, రిటైర్డ్ అయిన ఉద్యోగులు పుష్కర వనంలో కలుసుకుని ఒకరికొకరు ఆత్మీయత, అనురాగాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే పరమపదించిన తమ ఆత్మీయులను స్మరించుకుంటూ, వారికి నివాళులర్పించారు.



పుష్కర వనంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో సహచరులకు సత్కారం

అలాగే ఉద్యోగ నిర్వహణ, స్వయంకృషితో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటిన సహచరులు గౌరీనాయుడు, బుచ్చిబాబు, గనేశ్వర్రావు, టీవీ సూర్యనారాయణ, ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి రాజు, బేబిజ్ఞానాంబలను, ఆత్మీయ సమ్మేళనం రూపకర్త ఏవీఎల్ నారాయణరావును సత్కరించి, వారి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో సాయితాతారావు, కె.చంద్రశేఖర్, తేజోభాస్కరరావు, సుధాకర్, జానకిరామయ్య, జి.వెంకటేశ్వరరావు, జీవీవీఎస్ఎన్ మూర్తి, రవిబాబు పాల్గొన్నారు.

శంకరన్ ఆదర్శనీయుడు

సీటీఆర్ఐ: ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ అధికారులకు ఆదర్శనీయమని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. శంకరన్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి ఆదివాసీ మహాసభ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో అయినాపురపు మాట్లాడుతూ 1986లో శంకరన్ సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన జీఓలను పుస్తకంగా ముద్రించారన్నారు. ఇప్పటికీ ఉపయోగపడే 22 జీఓలు ఉన్నాయన్నారు. శంకరన్ ముఖ్య కార్యదర్శిగా ఉన్నప్పుడే ఐటీడీఏలు నెలకొల్పారన్నారు. స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్, ట్రైబల్ సబ్ ప్లాన్లను ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం పద్మభూషణ్ ఇచ్చి గౌరవించినప్పటికీ ఆ అవార్డును సున్నితంగా తిరస్కరించారన్నారు.